క్లుప్తంగా

జోరుగా జియో ట్యాగింగ్



జియో ట్యాగింగ్ ప్రక్రియలో సచివాలయ కార్యదర్శి

విజయనగరం: ప్రతి సచివాలయ కార్యదర్శి ఆయా పరిధిలో ఉన్న ఇంటింటిని జియో ట్యాగింగ్ చేసే ప్రక్రియను వేగవంతం చేశారు. ప్రతి విభాగానికీ చెందిన కార్యదర్శి ఆయా విభాగాల వారీగా గృహస్తుల వివరాలను సేకరించి నిక్షిప్తం చేస్తున్నారు. గతంలో ఈ ప్రక్రియను వలంటీర్లు చేపట్టగా ప్రస్తుతం సచివాలయ కార్యదర్శులకు ఆ బాధ్యతలు అప్పగించారు. విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పి.నల్లనయ్య ఆదేశాల మేరకు ఇంటింటి జియో ట్యాగింగ్ ప్రక్రియ చురుగ్గా సాగుతోంది.

కేన్సర్‌పై అవగాహన తప్పనిసరి



కార్యక్రమంలో మాట్లాడుతున్న రెడ్‌క్రాస్ సొసైటీ కార్యదర్శి సత్యం

విజయనగరం ఫోర్ట్: కేన్సర్‌పై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని రెడ్‌క్రాస్ సొసైటీ కార్యదర్శి సత్యం అన్నారు. గురువారం స్థానిక లక్ష్మీ నర్సింగ్ స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ కాలేజీలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, మిమ్స్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేన్సర్‌ను ముందుగా గుర్తించి చికిత్స తీసుకుంటే వ్యాధి నుంచి బయటపడవచ్చొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, డాక్టర్ జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'ద్వారం' 131వ జయంతి



వయోలిన్ కచేరీ నిర్వహిస్తున్న మావుడూరు సత్యనారాయణ శర్మ, తదితరులు

విజయనగరం టౌన్: ఫ్రెండ్స్ ఫైనార్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక కొత్తపేట మండపం వద్ద ఉన్న ఆర్యసోమయాజుల కాశీపతిరావు స్మారక భవనంలో పద్మశ్రీ ద్వారం వెంకటస్వామి నాయుడు 131వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ప్రముఖ వయోలిన్ విద్వాంసులు మావుడూరు సత్యనారాయణశర్మ వయోలిన్ కచేరీ అందరినీ ఆకట్టుకుంది. మృదంగంపై డాక్టర్ మండపాక రవి, ఘటంపై సూర్యప్రసాదరావు సహకరించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో అభిమానులు పాల్గొన్నారు.

మోసగాళ్ల అరెస్ట్

భోగాపురం: మండలంలోని చెరుకుపల్లి గ్రామానికి చెందిన రిక్కా నరసింగరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విశాఖపట్నం జిల్లా భీమిలి గ్రామానికి చెందిన అరిపల్లి వెంకటేష్ (అలియాస్ వెంకి), బోడిపల్లి సంధ్యారాణి, బోడిపల్లి ప్రభు, కొమర కనకమహాలక్ష్మిలను ఎస్సై సూర్యకుమారి గురువారం గాజువాకలో అదుపులోకి తీసుకుని అరెస్టు చేసినట్లు సీఐ ఎస్‌వీ ప్రభాకర్ తెలిపారు. ఈ నలుగురిని మేజిస్ట్రేట్ ఆదేశాల మేరకు విజయనగరం సబ్‌జైల్‌కు తరలించామన్నారు. మండలంలోని చెరుకుపల్లి పరిసర గ్రామాలకు చెందిన చాలామంది వీరి చేతిలో మోసపోయారు. ఈ మేరకు భోగాపురం పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశారు. అధిక వడ్డీలు ఇస్తామని చెప్పి బాధితుల నుంచి దాదాపు పది లక్షల రూపాయలు నిందితులు వసూలు చేసినట్లు సీఐ ప్రభాకర్ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నెల్లిమర్ల రూరల్: మండలంలోని దేవుని నెలివాడ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ మరమ్మతులు చేపడుతున్న నేపథ్యంలో శుక్రవారం సరఫరా నిలిపివేయనున్నట్లు ఆ శాఖ డీఈ త్రినాథరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని సువ్వానిపేట, దీపిల్లిపేట, గొర్లిపేట, కొత్తపేట, జగ్గరాజుపేట, దన్నానపేట, కోరాడపేట, ఏటీ అగ్రహారం, నీలంరాజుపేట, అప్పయ్యపేట, కుదిపి గ్రామాలకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

మద్యం సీసాలు స్వాధీనం

పూసపాటిరేగ: మండలంలోని తిప్పలవలస గ్రామంలో బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న మరుపల్లి అప్పన్న నుంచి 29 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ రవికుమార్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ నెల ఒకటో తేదీ నుంచి పూసపాటిరేగ మండలంలో నలుగురు వ్యక్తుల నుంచి 54 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని, నిందితులపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

కనులవిందు కుమిలి కోట

- పర్యాటకులను ఆకట్టుకుంటున్న ద్వాదశ ఆలయాలు
- ప్రత్యేక ఆకర్షణగా కుడ్య చిత్రాలు
- కార్తీకమాసంలో ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి సందర్శకుల తాకిడి



కుమిలిలో పర్యాటకులను ఆకట్టుకుంటున్న ప్రసిద్ధ ఆలయం

పూసపాటిరేగ: పెద్ద కోట.. చుట్టూ మోహరించిన సైనికులు.. అడుగడుగునా యుద్ధవీరుల విన్యాసాలు.. ఓవైపు పరుగులు తీసే రథాలు.. మరోవైపు గజరాజులు.. వీటిని చూడాలంటే కుమిలి కోటగా పిలవబడే ద్వాదశ దేవాలయాలకు వెళ్లాల్సిందే. దేవాలయ గోడలపై వేసిన ఈ చిత్రాలు పర్యటకులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. విజయనగరం నుంచి మింగినాపల్లి మీదుగా కుమిలికి 8 కిలోమీటర్ల ప్రయాణించి ఈ దేవాలయానికి చేరుకోవచ్చు. అలాగే పూసపాటిరేగ జాతీయ రహదారి మీదుగా 5 కిలోమీటర్లు ఆటోలో ప్రయాణించి ఇక్కడకు చేరుకోవచ్చు.

కుమిలిగా నామకరణం ఇలా..

విజయనగరం మహరాజుల సామ్రాజ్యం కుమిలి నుంచే ప్రారంభం అయిందనేందుకు సాక్ష్యాలు సజీవంగా కనిపిస్తున్నాయి. కుమిలి ప్రాంతంలో మహరాజులు నిర్మించిన మట్టికోట శిథిలమై మొండిగోడలు దర్శనమిస్తున్నాయి. నేడు కుమిలిగా పిలవబడుతున్న ఈ ప్రదేశమే నాడు కుంభిలాపురంగా పిలవబడేది. 17వ శతాబ్ధంలో మహరాజులు కుంభిలాపురం రాజధానిగా పరిపాలన చేస్తుండగా మట్టికోట కుమిలిపోవడంతో ఈ గ్రామానికి కుమిలిగా నామకరణం అయింది. కుమిలి కోటలో విశేషాలు చూడటానికి కార్తీకమాసంలో భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారు. కోటలో ద్వాదశ దేవాలయాలుగా పిలవబడే పురాతన ఆలయాలు, సూర్యనారాయణస్వామి, సత్యనారాయణస్వామి, దత్తత్రేయస్వామి, వేంకటేశ్వరస్వామి, ఆంజనేయస్వామి, గణపతిస్వామి, సీతారామస్వామి, రాధాకృష్ణులు, లక్ష్మీనరిసింహస్వామి, కాళికాదేవి, నవగ్రహ ఆలయాలు ఉన్నాయి. వీటిని దర్శించేందుకు భక్తులు నిత్యం ఇక్కడకు వస్తుంటారు. ఈ సమీపంలో పురాతన ఉమారామలింగేశ్వర ఆలయం కూడా ఉంది. ఆలయాలతో కుమిలి గ్రామం ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతోంది.



కుమిలిలో ద్వాదశ దేవాలయాలు



ప్రసిద్ధ దేవతామూర్తుల ఆలయాలు



ఉమారామలింగేశ్వర ఆలయం

నిబంధనలు అతిక్రమిస్తే షోకాజ్ నోటీసులు



50వ డివిజన్ వైఎస్సార్‌నగర్‌లో కమిషనర్‌కు సమస్యలు చెబుతున్న ప్రజలు

- కార్పొరేషన్ కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: మున్సిపల్ కార్పొరేషన్ నుంచి ఎటువంటి అనుమతుల్లేకుండా నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టిన వారికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని కార్పొరేషన్ కమిషనర్ పి. నల్లనయ్య ఆదేశించారు. నగరంలోని 50వ డివిజన్ వైఎస్సార్‌నగర్లో గురువారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడి, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్ నగర్‌లో అత్యధికంగా అనధికార నిర్మాణాలు ఉన్నట్లు గుర్తించారు. అలాగే కొన్ని ఇళ్ల ముందు కాలువలను ఆక్రమించి షెడ్లు వేసినట్లు గమనించారు. వీటిని తక్షణమే తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. అలాగే ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని ప్రజలకు సూచించారు. కాలువల సమస్య తీవ్రంగా ఉందని స్థానికులు తెలియజేయగా... అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి భవిష్యత్‌లో సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సకాలంలో పన్నులు చెల్లించి నగర అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ తిరుమలరావు, వివిధ విభాగాల సిబ్బంది, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యార్థుల మృతిపై ఆందోళన

విజయనగరం అర్బన్: పార్వతీపురం మన్యం జిల్లాలో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల విద్యార్థుల మృతి పట్ల రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థుల మృతికి గల కారణాలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని మన్యం జిల్లా కలెక్టర్‌ను కోరారు. మన్యం జిల్లాలో జియ్యమ్మవలస మండలం రావాడ రామభద్రపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల విద్యార్థితో పాటు కురుపాం గిరిజన సంక్షేమ పాఠశాల విద్యార్థి అనారోగ్యంతో మృతి చెందిన సమాచారం తెలుసుకున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ ఆశ్రమ పాఠశాల నిర్వహణ, నెలకొన్న పరిస్థితులపై గురువారం ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. ఒక్కరోజు వ్యవధిలోనే ఇద్దరు విద్యార్థులు మృతి చెందిన పరిస్థితులపై అధికారులు దృష్టి సారించాలని కోరారు.

ఆరోగ్యశ్రీ భోజనం అధ్వానం



మంచంపై పడేసిన భోజనం ప్యాకెట్లు

- తినలేక ఇబ్బంది పడుతున్న రోగులు
- పట్టించుకోని అధికారులు

నెల్లిమర్ల: నగర పంచాయతీలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్యశ్రీ పథకంలో భాగంగా రోగులకు అందజేస్తున్న భోజనం నాశిరకంగా ఉంటోందని విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో రోగులకు తినడానికి ఇబ్బంది పడుతున్నారు. సీహెచ్‌సీకి రోజుకు సుమారు 200 మంది రోగులు వస్తుండగా.. అందులో గర్భిణులు, ఇతర రోగులు ఇన్‌పేషంట్లుగా జాయిన్ అవుతున్నారు. వారందరికీ ఆరోగ్యశ్రీ కింద భోజనం అందిస్తున్నారు. మెనూ ప్రకారం చిక్కీ, రాగిమాల్ట్, అరటి పండు ఉండాల్సి ఉన్నప్పటికీ, అవేమీ ఇవ్వడం లేదు కేవలం అన్నం, కూర, సాంబారు, పెరుగు మాత్రమే ఇస్తున్నారని రోగులు చెబుతున్నారు.

బీపీ తనిఖీ చేసేదెవరు..?

సామాజిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు బీపీ తనిఖీ చేసేవారు కరువయ్యారు. ముఖ్యంగా వైద్యులు, నర్సులు ఎవరికి వారు తమ పని బీపీ చూడడం కాదని దాటవేస్తున్నారు. దీంతో రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. వచ్చే ప్రతి రోగికి దాదాపుగా బీపీ తనిఖీ చేయాల్సి ఉంటుంది. అయితే వైద్య సిబ్బంది మధ్య సఖ్యత లేకపోవడంతో రోగులు ఇబ్బంది పడుతున్నారు.

మధ్యంతర భృతి ప్రకటించాలి

- ఎస్టీయూ జిల్లా కమిటీ



మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు జోగారావు

విజయనగరం అర్బన్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు నూతన పీఆర్సీ అమలయ్యేవరకు మధ్యంతర భృతిని ప్రకటించాలని రాష్ట్రీయ ఉపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) డిమాండ్ చేసింది. సంఘ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం స్థానిక అమర్ భవనంలో జరిగిన సమావేశంలో ఎస్టీయూ ప్రతినిధులు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు మేలు జరిగేలా తక్షణమే 12వ పీఆర్సీ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని కోరారు.

జీఓ 117ను పూర్తిస్థాయిలో రద్దు చేయాలన్నారు. పీఎఫ్ బకాయిలు, ఏపీ జీఎల్ఐ, సరెండర్ లీవ్‌ల చెల్లింపులు, తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అలాగే ఆన్‌లైన్ వర్కుల నుంచి ఉపాధ్యాయులను మినహాయించాలని కోరారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు కె. జోగారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సూరిబాబు, సీనియర్ నాయకులు వి. గోవిందరావు, జిల్లా ఉపాధ్యక్షులు ఎస్. చిట్టిబాబు, అప్పలస్వామి, జిల్లా కార్యదర్శులు బంగారయ్య, జి. రవి, పెంకి రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

మురుగునీటి శుద్ధి కర్మాగారాలను ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

- మున్సిపల్ కమిషనర్ల సమీక్ష సమావేశంలో కలెక్టర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: మున్సిపాల్టీల్లో మురుగునీటి శుద్ధి కర్మాగారాల నిర్మాణాన్ని వెంటనే ప్రారంభించాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదేశించారు. పురపాలక సంఘాల్లో చెత్త నిర్వహణ, ఎస్టీపీల నిర్మాణంపై (సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్) మున్సిపల్ కమిషనర్లతో కలెక్టర్ తన చాంబర్‌లో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విజయనగరంలో పెద్దచెరువు వద్ద 5 ఎంఎల్‌డీ సామర్థ్యంతో సుమారు రూ.23 కోట్ల అంచనా వ్యయంతో ఐదేళ్ల కిందట ఎస్‌టీపీ నిర్మాణం చేపట్టినప్పటికీ నేటికీ పూర్తి కాలేదని చెప్పారు. కేవలం 23 శాతం పనులు మాత్రమే జరిగాయన్నారు. అదనంగా మరో రూ.16.83 కోట్లతో సవరించిన అంచనాలను ఇటీవలే ప్రభుత్వానికి పంపించడం జరిగిందని, టెండర్ల ప్రక్రియను త్వరగా పూర్తి చేసి ప్లాంట్ నిర్మాణాన్ని త్వరగా ప్రారంభించాలని ఆదేశించారు. బొబ్బిలి మున్సిపాలిటీలో 3 ఎస్‌టీపీలు, 5 ఎస్ఎస్‌టీపీలు.. నెల్లిమర్ల నగర పంచాయతీలో 4 ఎంఎల్‌డీల సామర్థ్యంతో 1.6 ఎకరాల విస్తీర్ణంలో ప్రతిపాదిత ఎస్‌టీపీ.. రాజాం మున్సిపాలిటీలో మూడు ఎస్‌టీపీలు, ఏడు ఎస్ఎస్‌టీపీల నిర్మాణానికి చేసిన ప్రతిపాదనలపై సమీక్షించారు. సమావేశంలో విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పి.నల్లనయ్య, బొబ్బిలి కమిషనర్ ఎల్.రామలక్ష్మి, రాజాం కమిషనర్ జె.రామప్పలనాయుడు, నెల్లిమర్ల కమిషనర్ అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

మల్లివీడులో అగ్ని ప్రమాదం



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

లక్కవరపుకోట: మండలంలోని మల్లివీడులో బుడం శ్రీను ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా గురువారం రాత్రి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. రెండంతస్తుల ఇంటిలో శ్రీను భార్య, పిల్లలు గ్రౌండ్ ఫ్లోర్‌లో టీవీ చూస్తుండగా..పై అంతస్తులో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. ముందుగా ఫ్రిజ్ వద్ద పెద్ద ఎత్తున మంటలు చెలరేగగా.. ఫ్రిజ్‌కు సంబంధించిన గ్యాస్ ట్యాంక్ పేలిపోవడంతో మంటలు పెద్ద ఎత్తున ఎగసిపడ్డాయి. దీంతో దుస్తులు, మంచాలు, సోఫాలు, ఏసీ కాలిపోయాయి. ప్రమాద సమాచారం అందుకున్న కొత్తవలస అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో నాలుగు తులాల బంగారు ఆభరణాలు, 74 వేల రూపాయల నగదు కాలిపోయినట్లు బాధితుడు తెలిపాడు.

దయేరియా నియంత్రణపై అవగాహన



ప్రాణాంతక అంటు వ్యాధులు ప్రబలకుండా ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పి.నల్లనయ్య సూచించారు. ఈ మేరకు దయేరియా నియంత్రణపై గురువారం నగరంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. ప్రతి సచివాలయం పరిధిలో స్టాప్ డయేరియా పేరిట అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సచివాలయ సిబ్బంది, ఏఎన్ఎంలు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందజేస్తూ, అంటువ్యాధులు సక్రమించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్నారు.

\- విజయనగరం

బ్యాంక్ ఖాతాలకు ఆధార్ అనుసంధానం



రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా నేతృత్వంలో ప్రజల బ్యాంక్ ఖాతాలకు ఆధార్ అనుసంధాన ప్రక్రియను సచివాలయ సిబ్బంది ముమ్మరం చేశారు. విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పి. నల్లనయ్య సూచనలతో ప్రతి సచివాలయ పరిధిలో కార్యదర్శులు ప్రజల అకౌంట్లను అనుసంధానిస్తున్నారు. ప్రభుత్వం నుంచి మంజూరయ్యే ఆర్థికపరమైన అంశాలు సులభతరంగా జరిగేందుకు ఎన్‌పీసీఐ విధానం శ్రేయస్కరమని కమిషనర్ చెబుతున్నారు.

\- విజయనగరం

డిసెంబర్ 15లోగా రీ సర్వే ..



విజయనగర పరిధిలో చేపడుతున్న అర్బన్ రీసర్వే డిసెంబర్ 15 నాటికల్లా శతశాతం పూర్తి చేయాలని కమిషనర్ పి.నల్లనయ్య ఆదేశించారు. గురువారం స్థానిక ఆనంద గజపతి ఆడిటోరియంలో నిర్వహించిన అర్బన్ రీసర్వే శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు అర్బన్ రీసర్వే చేపడుతున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు 90 శాతం రీసర్వే పూర్తయిందని, డిసెంబర్ 15 నాటికి శతశాతం పూర్తి చేయాలని సూచించారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ తిరుమలరావు, అసిస్టెంట్ సిటీప్లానర్లు ఐవీ రమణమూర్తి, ఎల్. హరిబాబు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు , వీఆర్వోలు, పరిపాలన, ప్రణాళిక, రెవెన్యూ కార్యదర్శులు పాల్గొన్నారు.

\- విజయనగరం

మహిళలకు కేన్సర్ నిర్ధారణ పరీక్షలు



నగరంలోని ఎంఆర్ లేడీస్ రిక్రియేషన్ వెల్ఫేర్ క్లబ్ ఆవరణలో వికాస తరంగిణి , లేడీస్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం మహిళలకు కేన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. సుమారు 42 మంది మహిళలకు పరీక్షలు నిర్వహించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి రమణమ్మ, జయలక్ష్మి, భోగరాజు సూర్యలక్ష్మి, శ్రీదేవీ, సుభద్ర, వీణ, ధనలక్ష్మి, ఆరోగ్య వికాస్ కన్వీనర్ శకుంతల తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం టౌన్

పరిశుభ్రమైన నీటిని అందించాలి..



నగర పంచాయతీ పరిధిలోని ప్రజలకు పరిశుభ్రమైన తాగునీటిని అందించాలని కమిషనర్ కె. అప్పలరాజు సూచించారు. జరజాపుపేటలోని తాగునీటి పథకాలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా తాగునీటి వనరుల్లో చేపడుతున్న క్లోరినేషన్‌పై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, స్వచ్ఛమైన తాగునీరు అందించడంతో పాటు ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ డి. ఉమాభాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

\- నెల్లిమర్ల